
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
గురువారం 23 అక్టోబరు 2025



స్లాట్ బుకింగ్‌తోనే
సీసీఐ పత్తి కొనుగోళ్లు

- తొమ్మిది జిన్నింగ్ మిల్లుల కేటాయింపు
- నాణ్యమైన పత్తి క్వింటాల్ ధర రూ. 8,110
- మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్



షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రైతులు స్లాట్ బుకింగ్ చేసుకున్న పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పత్తి రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాయకుండా ప్రభుత్వం స్లాట్ బుకింగ్ పద్ధతిని ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులు ప్లేస్టోర్‌లోకి వెళ్లి కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, యాప్‌లో రైతు పేరు, మార్కెట్ పేరు, పత్తి విక్రయించే మిల్లు పేరు, పత్తి వివరాలను పొందుపరిస్తే స్లాట్ బుకింగ్ అవుతుందన్నారు. స్లాట్ బుకింగ్‌కు ఇబ్బంది అయితే గ్రామాల్లోనే ఏఈఓలను గాని, వ్యవసాయ మార్కెట్ యార్డుకు వచ్చి స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయశాఖ సర్వేలో పత్తి వేసిన ప్రతీ రైతు నుంచి ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. 8 శాతంలోపు తేమ ఉన్న నాణ్యమైన పత్తి క్వింటాళుకు 8,110 రూపాయల ధర లభిస్తుందని, తేమ పెరిగితే ధర తగ్గుతుందన్నారు. 12శాతంపైగా తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేయబోమని స్పష్టం చేశారు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి శివారులోని రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్ మిల్లు, దోడియా అగ్రో ఇండస్ట్రీస్, సోలిపూర్ శివారులోని గౌరవ్ ఇండస్ట్రీస్, ఎలికట్ట శివారులోని శ్యాం కాటెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, నందిగామా మండల కేంద్రం సమీపంలోని తిరుమల ట్రేడింగ్ కంపెనీ, హరిహర జిన్నింగ్ అండ్ ప్రెసింగ్ ప్రైవేట్ లిమిటెడ్, తుల్జా భవాని కాటెక్స్, కొందుర్గు మండలంలోని వనంపల్లి గ్రామ శివారులోని శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్, సూపర్ కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ జిన్నింగ్ మిల్లులో అన్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. స్లాట్ బుకింగ్ చేసుకోకుండా రైతులు జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకురావద్దని కోరారు. స్లాట్ బుకింగ్ చేసుకుంటే సోమవారం నుంచి సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుందని తెలిపారు. నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి రైతులు మద్దతు ధరను పొందాలని శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ప్రచార కమిటీ ఇన్‌చార్జిల
నియామకం



ఎండీ ఫరీద్



కాంటేకార్ భగీరథ్

ఆమనగల్లు/కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ యూసఫ్‌గూడ డివిజన్ ఇన్‌చార్జిగా ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్ నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి అఫ్రాజ్ ముల్లా, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామి, ఉపాధ్యక్షులు రితిన్‌రావుల నుంచి ఫరీద్‌కు నియామకపు ఉత్తర్వులు అందాయి. అలాగే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బీజేపీ ప్రచార కమిటీ షేక్‌పేట డివిజన్ ఇన్‌చార్జిగా కడ్తాల మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకార్ భగీరథ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్‌ల నుంచి ఆయనకు నియామకపు ఉత్తర్వులు అందాయి.

కనికరం లేని కొడుకులు

7

ఆస్తి కోసం తండ్రిని హతమార్చిన తనయులు

మరోచోట తల్లిని ఇంటిని గెంటేసిన ప్రబుద్ధుడు





దినదినం
దుర్భరం!
భారంగా దినసరి కూలీల బతుకులు

దినసరి కూలీల బతుకులు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. పని దొరికినప్పుడు మాత్రమే పూట గడిచే పరిస్థితి నెలకొంది. ప్రతీరోజు ఉదయం 6గంటలకే చేతిలో పారలు, గంపలు పట్టుకుని అడ్డా మీద నిలబడి పని కోసం ఎదురు చూస్తుంటారు. పని దొరికితే సంతోషం లేదంటే మధ్యాహ్నం వరకు వేచిచూసి నిరాశగా ఇంటికి వెళ్లి పస్తులతో గడపాల్సి వస్తుంది. కుటుంబ పోషణ కోసం మరికొందరు ఉదయం నుంచి సాయంత్రం వరకు అడ్డా మీదే నిరీక్షిస్తుంటారు. జిల్లాల్లో ప్రస్తుతం లక్ష మంది కార్మికులు, కూలీలు ఉన్నా వారిలో సగం మందికి కూడా గుర్తింపు కార్డులు లేవు. దీంతో వారు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు పొందలేక అవస్థలు పడుతున్నారు.

- పనుల కోసం అడ్డాల వద్ద పడిగాపులు
- ఉదయం నుంచి రోడ్లపై నిరీక్షణ
- పని దొరకకుంటే పూట గడవటం కష్టమే..
- గుర్తింపు కార్డులు లేక ఇబ్బందులు
- ప్రత్యేక స్థలం కేటాయింపునకు డిమాండ్



పని కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న కూలీలు

షాద్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే రహదారికి ఇరువైపులా గంటల తరబడి వందల సంఖ్యలో కూలీలు పని కోసం ఎదురుచూస్తుంటారు. వారు అటూ ఇటూ తిరిగే క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా కూలీల కోసం ప్రత్యేక స్థలం కేటాయించి వసతులు కల్పించడంతో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. గత రెండేళ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలైంది. దీంతో ఇళ్ల నిర్మాణాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. దీంతో భవన నిర్మాణ కార్మికులు, అడ్డా మీద ఉండే కూలీలకు పనులు దొరకడంలేదు. దీంతో పాటు ఈ మధ్య కాలంలో సిమెంట్, ఐరన్, ఇసుక ధరలు కూడా పెరగడంతో అన్ని రకాల నిర్మాణాలకు కొంత బ్రేక్ పడింది. ఎవరైనా ఇంటి నిర్మాణాలు చేపడితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారికి కాంట్రాక్టులు ఇస్తున్నారు. ఆ కాంట్రాక్టర్లు తమ స్వస్థలాల నుంచే కూలీలను పిలిపించుకుని పనులు చేయిస్తున్నారు. దీంతో స్థానికంగా ఉండే కార్మికులకు ఉపాధి దొరకడం కష్టంగా మారింది.

రంగారెడ్డి జిల్లాల్లో ప్రస్తుతం లక్ష మంది కార్మికులు, కూలీలు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఎక్కువ శాతం రోజువారీ పనులు

మిగతా 8వ పేజీలో...

గుర్తింపు కార్డు ప్రయోజనాలు..

గుర్తింపు కార్డులు ఉన్న భవన నిర్మాణ కార్మికులకు నాలుగు రకాల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుంది. ఎవరైనా అనారోగ్యం, ప్రమాదాల కారణంగా ఆస్పత్రుల్లో చేరితే వారికి రోజుకు రూ.300, పరిస్థితిని బట్టి గరిష్ఠంగా నెలకు రూ.4500 సహాయం అందజేస్తుంది. మహిళా కార్మికులకు మెటర్నిటీ బెనిఫిట్ సౌకర్యంతో పాటు, ప్రసవ సమయంలో ఆర్థిక సహాయం అందిస్తారు. భవన నిర్మాణ కార్మికులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.6లక్షల బీమా, అంగవైకల్యం పొందితే రూ.5లక్షలు అందజేస్తుంది. ఇలా భవన నిర్మాణ కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తున్నప్పటికీ గుర్తింపు కార్డులు లేకపోవడంతో వేలాది మంది సంక్షేమ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు.

గుర్తింపు కార్డులు అందజేయాలి



కార్మికులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలి. కార్డులు ఉన్నవారికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా లేబర్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉపాధి లేక పస్తులతో ఉన్న కార్మికుల కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో కూలీ పనులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. ఇళ్ల నిర్మాణాలు తగ్గిపోవడంతో ప్రస్తుతం కూలీ పనులు దొరకక కార్మికులు పస్తులతో కాలం గడుపుతున్నారు. వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి.

వీరాంజనేయులు, భవన నిర్మాణ కార్మికుడు

ఎయిర్‌పోర్టులో రోడ్డు ప్రమాదం
భారీగా ట్రాఫిక్ జామ్

శంషాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో రెండు కార్లు ఢీకొన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ అయ్యింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్‌పోర్టులోని ఏరోస్పేస్ పార్క్ ఎదురుగా శ్రీశైలం నుంచి ఎయిర్‌పోర్టులోకి వస్తున్న కారు (టీజీ 07 2573) డ్రైవర్ కుంభ చిన్న రాయుడు అదే రూట్‌లో వెళ్తున్న మరో కారు(టీజీ -7 ఎక్స్ 0146)ను ఢీకొట్టాడు. దీంతో రెండు కార్లు డ్యామేజ్ అయ్యాయి. రోడ్డుపై ఇరు కార్ల డ్రైవర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ రోడ్లపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న జీఎంఆర్ రక్షా సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల డ్రైవర్లకు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది. ఆ సమయంలో ఎయిర్ పోర్టులోకి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎవరు ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు



ఆకాశం ఎందుకో ఎర్రబడ్డదీ..

రావిర్యాల, తుక్కుగూడ సమీపంలో ఆకాశం కాషాయం రంగులోకి మారింది. అప్పటివరకు నిర్మలంగా ఉన్న నీలాకాశం ఒక్కసారిగా ఎరుపు, కాషాయం రంగులను పులుముకున్నట్లుగా మారింది. దీంతో స్థానికులు నింగి వైపు వింతగా చూశారు. కొందరు తమ సెల్‌ఫోన్లలో రంగులద్దుకున్న ఆకాశాన్ని బంధించారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి
సారించండి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎక్కడ కూడా మురుగు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వార్డుల వారీగా సమస్యలను గుర్తించి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సమయానుకూలంగా పన్నులు వసూలు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి వీటికి అవసరమైన నిధులు ఎంతనేది ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ సమస్యలు పరిష్కరించాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సమస్య ఏదైనా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.కోటి
పరిహారం ఇవ్వాలి

- బినామీలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు
- కోరినంత పరిహారం ఇవ్వకపోతే భూముల జోలికి రావొద్దు
- భారీగా మోహరించిన పోలీసులు



అధికారులతో వాదనకు దిగిన రైతులు

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.కోటి పరిహారం ఇస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు. కంపెనీల ఏర్పాటు కోసం భూములను సేకరించడానికి బుధవారం యాచారం మండలం మొండిగౌరెల్లి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో అక్కడ కొంత ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలోని 19 సర్వే నెంబర్‌లో 575 ఎకరాలు, 68లో 788 ఎకరాలు, 127లో 122 ఎకరాల భూములున్నాయి. కాగా వీటన్నింటిలో 820 ఎకరాల భూములను సేకరించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూములను సేకరించడానికి రైతుల అభిప్రాయం తెలుసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ అధికారులను ఆదేశించింది. దాంతో బుధవారం ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంత రెడ్డి, యాచారం తహసీల్దార్ టి.అయ్యప్పలు గ్రామంలో ప్రజాభిప్రాయ

మిగతా 8వ పేజీలో...

ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించొద్దు

మెడికల్ షాపుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల తనిఖీలు



షాద్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వైద్యుల ప్రిస్క్రిప్షన్లు లేకుండా మందులు విక్రయించరాదని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు హెచ్చరించారు. ఈ మేరకు షాద్‌నగర్ పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో బుధవారం వారు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అన్వేష్, రఫీ, నాగరాజు, విశ్వనాథ్‌రెడ్డి మెడికల్ షాపుల్లో ఉన్న మందుల వివరాలు, ఎక్స్‌పైరీ డేట్‌లను పరిశీలించారు. మందులు ఖరీదు చేసిన వారికి రసీదుల ఇస్తున్నారా లేదా? అని ఆరా తీశారు. మెడికల్ షాపుల్లో ఉన్న కంప్యూటర్లు, ఇతర పరికరాలను పరిశీలించారు. షాద్‌నగర్ పట్టణంలోని 12 మెడికల్ షాపుల్లో ఏకకాలంగా సోదాలు నిర్వహించడంతో మిగతా దుకాణా యజమానులు అప్రమత్తమయ్యారు.

ధర ఉన్నా.. దిగుబడి సున్న

అధిక వర్షాలతో పొలంలోనే కుళ్లిపోతున్న క్యారెట్ పంట
మార్కెట్‌లో భలే డిమాండ్.. పంట నష్టంతో బోరుమంటున్న రైతులు



క్యారెట్‌ను శుభ్రం చేస్తున్న రైతు

చేవెళ్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి సాగు చేసిన క్యారెట్ పంట చేతికొచ్చే సమయంలో వర్షాల కారణంగా ఎక్కడికక్కడ పొలాల్లోనే కుళ్లిపోతుండడంతో రైతులు బోరుమంటున్నారు. చేవెళ్ల డివిజన్‌లో ప్రతీ ఏడాది క్యారెట్ పంటను అధికంగా సాగు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది కూడా చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి మండలాల్లో దాదాపుగా 600 ఎకరాలకుపైగా క్యారెట్ పంటను సాగు చేశారు. అయితే అధికంగా వర్షాలు కురువడంతో పొలాల్లో నీరు నిలిచి క్యారెట్ పంట కుళ్లిపోవడంతో దిగుబడి రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చేవెళ్ల మండలంలోని దేవరంపల్లి, చేవెళ్ల, పామెన, చన్వల్లి, కందవాడ, పలుగుట్ట, గుండాల, అల్లావాడ, లక్ష్మీగూడ, బస్తేపూర్, మీర్జగూడ, ఖానాపూర్, ఘనాపూర్, ఆలూరు, దామరగిద్ద తదితర గ్రామాల్లో రైతులు క్యారెట్ పంటను సాగు చేశారు. అయితే ఇటీవల

మిగతా 8వ పేజీలో...



పామెన గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న క్యారెట్ పంట

హోంగార్డుల సేవలు అభినందనీయం

వికారాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ హోంగార్డు అధికారి మహేశ్ సేవలు అమోఘమని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో మహేశ్‌ను ఎస్పీ సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్ సుదీర్ఘకాలం క్రమ శిక్షణతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు అందించిన సేవలు మరువలేవనివన్నారు. ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుధాకర్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



మహేశ్‌ను సన్మానిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



తిమ్మాయిపల్లి రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

భూసేకరణకు సహకరించాలి

- ఫ్యూచర్‌సిటీలో భూములు కోల్పోతున్న ప్రతీ రైతుకు పరిహారం
- కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన ఫ్యూచర్‌సిటీ కోసం భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం తగిన న్యాయం చేస్తుందని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో టీజీఐఐసీ అధికారులు, మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ రైతులతో భూనష్ట పరిహారంపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కందుకూరు మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామ రెవెన్యూలోని సర్వే నంబర్ 9లోని ప్రభుత్వ, అసైన్డ్ భూములను ఫ్యూచర్‌సిటీ కోసం భూసేకరణ చేపడుతుందని, ఇందులో భూములు కోల్పోతున్న ప్రతీ రైతుకు తగిన పరిహారం అందజేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఎకరాకు రూ. 51,51,906 చెల్లించడంతో పాటు 121 గజాల ఇంటి స్థలం కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులు భూసర్వేకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కందుకూరు తహసీల్దార్ గోపాల్, టీజీఐఐసీ అధికారులు ప్రసాద్, అజీజా సుల్తానా, రైతులు పాల్గొన్నారు.

అవినీతిని వెలికితీసేందుకే సోషల్ ఆడిట్

మోమిన్‌పేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అవినీతి జరగకుండా చూసేందుకే సామాజిక తనిఖీ నిర్వహించినట్లు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై.మహేందర్‌రెడ్డి, డీఆర్‌డీవో ఏపీడీ సరళ అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లోని మండల పరిషత్‌లో సామాజిక తనిఖీ సభను నిర్వహించారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు జరిగిన 527 పనుల్లో కూలీలకు చెల్లించిన రూ.9.8కోట్లకు సంబంధించిన లెక్కలపై విచారణ చేశారు. వారం రోజులుగా ఉపాధి హామీ సిబ్బంది గ్రామాల్లో చేసినా సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. వివిధ పొరపాట్లకు క్షేత్రస్థాయి సిబ్బందికి రూ.11వేల జరిమానా, పనుల్లో జరిగిన అవకతవకలకు రూ.32,567 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు సదానందం, యాదగిరి, రాములు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న అధికారులు

పాఠశాలలో పాము కలకలం

యాలాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): యాలాలలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పాము కలకలం రేపింది. బుధవారం ఉదయం విద్యార్థినులకు బాత్రూంలో పాము కనిపించింది. దీంతో వారు టీచర్లకు తెలిపారు. ఉపాధ్యాయులు గ్రామంలో కొందరిని పిలిపించి పామును చంపించారు.

ఇందిరమ్మ ఇళ్లు ఆత్మగౌరవానికి ప్రతీక

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండల కేంద్రానికి చెందిన పోతుగంటి మాదవి, పోతుగంటి సిద్ధమ్మ, నర్సమ్మలకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఇళ్లు కూడా ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిట్టపల్లి అంజయ్య, డిగ్రీ కృష్ణ, రవీందర్ యాదవ్, కృష్ణ, గణేశ్, పాండు, రమేశ్, జనార్దన్ రెడ్డి, శేఖర్, నరేశ్ ఉన్నారు.

రైతు సేవా కేంద్రం ప్రారంభం

పోచారం గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో తలకొండపల్లిలో ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో బాలాజీ సింగ్, అంజయ్య, మోహన్ రెడ్డి, యాదగిరి, పాండు, మల్లేశ్, గణేశ్, రవీందర్,కృష్ణ, రమేశ్, కుమార్, రాజురెడ్డి ఉన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరుపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

జెన్నాయిగూడ రైతులకు న్యాయం చేయాలి

మహేశ్వరం/కందుకూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుక్కుగూడ మున్సిపాలిటీలోని జెన్నాయిగూడ గ్రామ రైతులకు న్యాయం జరిగే వరకు ఉద్యమాలను ఆపేదిలేదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాంచందర్ అన్నారు. జెన్నాయిగూడ రైతులకు తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో అప్పటి ప్రభుత్వం వివిధ రకాల పరిశ్రమల కోసం టీఎస్ఐఐసీకి జెన్నాయిగూడ రైతుల భూములను సేకరించిందని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడంలో అప్పటి, ఇప్పటి ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు యాదయ్య, రవికుమార్, శేఖర్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

బీసీల సాధికారత రాజ్యాధికారంతోనే సాధ్యం

షాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బీసీల సాధికారత రాజ్యాధికారంతోనే సాధ్యమని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు అన్నారు. బీసీ రిజర్వేషన్ సాధన సమితి షాబాద్‌లో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారంతో 11వ రోజుకు చేరింది. ఈ దీక్షలో షాబాద్ మండల మున్నూరు కాపు నాయకులు పాల్గొన్నారు. బీసీ సంఘం నాయకులు చేస్తున్న దీక్షకు మద్దతుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ కుంట సిద్దిరాములు, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల స్వామి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లను కొందరు కుట్రతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కానుగుబావి తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ తుల్జా భవాని మాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించే వేడుకలకు ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కానుగుబావి తండాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా మొదటి రోజు గణపతిపూజ, స్వస్తి హవాచనం, అఖండ దీపారాదన, అంకురార్పణ, గోపూజ, అగ్నిప్రతిష్ఠ, హోమాలు నిర్వహించారు. తండాలో గిరిజనులు ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీక్యానాయక్, పాండునాయక్, బీచ్యానాయక్, నర్సింగ్, లక్ష్మణ్, నరేశ్, బాలు, రాజు, నాగార్జున, దేవుల, జాన్య, రతన్ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠ పూజల్లో భక్తులు

భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

దుద్యాల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ భారతిలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన చేసి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను సూచించారు. బుధవారం హస్నాబాద్‌లో భూ భారతిలో స్వీకరించిన 27 సాదా బైనామా దరఖాస్తులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు సూచించారు. అనంతరం తహసీల్దార్, సిబ్బందితో కలిసి గ్రామానికి చెందిన రైతుల భూ సమస్యలను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, గోపాల్ ఉన్నారు.

ఇంటి స్థల సమస్యను పరిష్కరిస్తాం

- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కిన్నెర కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు ప్రభుత్వం కేటాయించిన స్థలం విషయంలో తలెత్తిన విషయంలో సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. తనకు ప్రభుత్వం కేటయించిన స్థలంలో కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మొగులయ్య ఇటీవల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. దీంతో ఆయన కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్లో మాట్లాడారు. ఈ మేరకు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డితో కలిసి మొగులయ్య బుధవారం కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. మొగులయ్యకు హయత్‌నగర్ కుంట్లూరు రోడ్డులో సర్వే నం.159లో కేటాయించిన ఇంటి స్థలం విషయంలో ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో సమస్య ఎదురవుతున్నందున ప్రభుత్వ పరంగా తగు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.



కలెక్టర్‌తో మొగులయ్య

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

తాండూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధి బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు మండలాల రైతులు తమ పంటలను ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలని తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జి ఏడీఏ కొమరయ్య తెలిపారు. రైతులంతా తమ పంటలను వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు. పత్తి అమ్ముకునేందుకు యాలాలలో 3, పెద్దేముల్ మండలంలో 2 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. పత్తి రైతులు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 'కపాస్ కిసాన్' యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రకారమే విక్రయాలు కొనసాగుతాయని అన్నారు.



ఏడీఏ కొమరయ్య

చట్ట విరుద్ధ పనులు చేయొద్దు

మాడ్గుల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎవరైనా చట విరుద్ధ కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ వేణుగోపాల్ హెచ్చరించారు. ఎస్సైలు రాఘవేందర్, నాగరాజుతో కలిసి మాడ్గుల పరిధిలోని రౌడీ షీటర్లు, సస్పెక్ట్ సీటర్ల ఇళ్లను బుధవారం ఆకస్మికంగా తనఖీ చేశారు. వారి ప్రవర్తన తీరును పరిశీలించారు.

ఘనంగా చినజీయర్‌స్వామి తిరునక్షత్ర మహోత్సవం

- హాజరైన మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు
- పలువురికి అవార్డుల అందజేత

శంషాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ప్రముఖ అధ్యాత్మిక గురువు శ్రీ త్రిదండి రామానుజ చినజీయర్‌స్వామి 69వ తిరునక్షత్ర (జన్మదినం) వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో చినజీయర్‌స్వామి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల అశీర్వాదం తీసుకున్నారు. చినజీయర్ స్వామి జన్మదినాన్ని పురస్కారించుకుని పలు సేవ కార్యక్రమాలు చేపట్టారు. స్వామిజీ తిరునక్షత్ర మహోత్సవంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు. ఈ ఏడాది సత్యనారాయణచార్యులకు జీయర్ అవార్డు దక్కింది. అలాగే పెన్నా మధుసూదన్‌కు విద్వాన్‌మణి అవార్డు , డాక్టర్ సౌమ్యమిశ్రా ఐపీఎస్, సజ్జనార్‌లకు సేవ శిరోమణి అవార్డులు దక్కాయని నిర్వహకులు తెలిపారు. స్వామిజీ తిరునక్షత్ర మహోత్సవానికి నగరం నలువైపుల నుంచి భారీగా తరలివచ్చారు. భక్తులకు చిన జీయర్‌స్వామి మంగళశాసనములు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సత్యనారాయణచార్యులకు అవార్డును అందజేస్తున్న చినజీయర్‌స్వామి

శ్రీశైలం హైవేను విస్తరించాలి

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి తెలిపారు. జాతీయ రహదారిని విస్తరించాలని కడ్తాల, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం ఎంపీ మల్లు రవిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఈ మేరకు టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఎంపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తుక్కుగూడ నుంచి కందుకూర్, కడ్తాల్, ఆమనగల్లు, వెల్దండ, డిండి మీదుగా శ్రీశైలం వరకు జాతీయ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీకి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, మండ్లీ రాములు, అంజినాయక్ ఉన్నారు.



ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు



గురునాథ్‌రెడ్డిని కలిసిన వ్యాపారులు

మెడికల్ కాలేజీని తరలించొద్దు

- పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు వినతి

కొడంగల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొడంగల్‌కు మంజూరైన మెడికల్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ గురుకులాలను వేరేచోటకు తరలించొద్దని, కొడంగల్‌లో రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలను కోల్పోతున్న వారికి న్యాయ పరిహారం ఇవ్వాలని జేఏసీ నాయకులు, వ్యాపార సముదాయాల యజమానులు కోరారు. బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన గురునాథ్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి విద్యాసంస్థలు కొడంగల్‌లోనే ఏర్పాటయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పేదలకు ప్రభుత్వాలు అండగా నిలవాలి

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వాలు అండగా ఉండాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ఆమె నివాసంలో మహేశ్వరం ప్రాంతానికి చెందిన పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉండి ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందించామన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఆంక్షలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయమన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, నవీన్, బాలయ్య, రమేష్ ఉన్నారు.

ఒబేదుల్లాను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఒబెదుల్లా కొత్వాల్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్ రెడ్డి

కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ను బుధవారం టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కొత్వాల్ ను కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. మైనార్టీ మహిళలకు కట్టు మిషన్లు అందజేయాలని కోరారు. ఒబేదుల్లా కొత్వాల్‌ను కలిసిన వారిలో మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ తదితరులు ఉన్నారు.

ఆర్ఎస్ఎస్ పథ సంచాలన్

కోట్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కోట్‌పల్లి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ శతజయంతి పథ సంచాలన్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ శంకర్ స్వామీజీ దామర్చడు(తెలంగాణ ప్రాంత సాధు పరిషత్ అధ్యక్షులు) హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ. ఆర్ఎస్ఎస్‌ను 1925లో స్థాపించారన్నారు. దేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం, 2025 విజయదశమికి వందేళ్లు పూర్తిచేసుకుందని తెలిపారు.

చెక్ డ్యామ్‌లను పరిశీలించిన విద్యార్థులు



కుంటలు, చెక్ డ్యామ్‌లను పరిశీలించిన కంది వ్యవసాయ విద్యార్థులు

మోమిన్‌పేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో భూమి కోతకు గురి కాకుండా ఉండేందుకు, నీటి నిల్వకు చెక్ డ్యామ్‌లను దోహదపడుతాయని కంది మండలం వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు అన్నారు. బుధవారం కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా గోవిందాపూర్‌లో కందకాలు, నీటి కుంటలు, వాటర్‌షెడ్, చెక్‌డ్యామ్‌లు, రాతి కట్టడాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కిషన్, పాషా, ప్రసాద్, సాయిల్ అండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ శ్రీనివాసులు, ఆర్.స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో రాణించాలి



సాంకేతిక ఆవిష్కరణలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్లు

మేడ్చల్ టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక రంగంలో రాణిస్తేనే కొత్త ఆవిష్కరణలు వస్తాయని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్రస్థాయి ఎక్స్‌పో-25 నిర్వహించారు. 439 జట్లు, 1,300 మంది విద్యార్థులు పాల్గొని వారు చేసిన సాంకేతిక ఆవిష్కరణలను ప్రదర్శించారు. దినదినాభి వృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో పట్టు సాధించాలంటే కొత్త ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్లౌడ్ ఆర్కిటెక్ట్, ఏడబ్ల్యూఎస్ కమ్యూనిటీ బిల్డర్ అండ్ అంబాసిడర్ ఎం.నాగబాబు, కళాశాల కార్యదర్శి టీవీ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సమస్యలపై నిర్లక్ష్యం తగదు


» జిల్లా రైతు సమాఖ్య సమావేశంలో ఆవేదన..

మేడ్చల్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రైతుల సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జిల్లా రైతు సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలపై చర్చించారు. యాసంగి సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో కాలేదని, జిల్లాలో 49,725మంది రైతులు ఉండగా అందులో 30వేల మందికే రైతు భరోసా అందిందని, రెవెన్యూ సదస్సులు నామమాత్రంగా నిర్వహించారని అన్నారు. తరుగు పేరిట రైతులను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల్లో విద్యుత్‌వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయని వాపోయారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో జిల్లా రైతు సమాఖ్య నాయకులు సంజీవరెడ్డి, జగన్నాథం, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు

ఆస్తి తగాదాలతో తండ్రిని హతమార్చిన కొడుకు



మేడ్చల్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల నేపథ్యంలో మద్యం మత్తులో కొడకు కన్న తండ్రిని హత మార్చాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా ములుగు మండలం అచ్చాయిపల్లి గ్రామానికి చెందిన నిజాముద్దీన్ (65)కు అతని కొడుకు షేక్ సాదక్‌తో కొద్ది రోజులుగా ఆస్తి విషయంలో తగువు కొనసాగుతోంది. ఈ క్రమంలో నిజాముద్దీన్, షేక్ సాదక్ అతని మిత్రుడు రాజుతో కలిసి ముగ్గురు మంగళవారం శామీర్‌పేట మండలం మురాహరిపల్లి సమీపంలోని ప్రజయ్ వాటర్ ప్లాంట్ వద్ద ముగ్గురు కలిసి మద్యం సేవించారు. ఆ సమయంలోనూ తండ్రీకొడుకుల మధ్య ఆస్తి విషయంలో తగువు పడ్డారు. మాటామాటా పెరగడంతో ఆగ్రహంతో సాదక్ అక్కడే ఉన్న బండరాయితో తండ్రి నిజాముద్దీన్ తలపై మోదీ అక్కడ నుంచి మిత్రుడు రాజుతో కలిసి పరారయ్యాడు.



నిజాముద్దీన్(ఫైల్)

బుధవారం ఉదయం నిజాముద్దీన్ మృతదేహాన్ని చూసిన స్థానికులు మేడ్చల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, హత్యకు పాల్పడ్డ షేక్ సాదక్ అతడి మిత్రుడు రాజును పోలీసులు అదుపులో తీసుకున్నట్టు సమాచారం. ఆస్తి విషయంలో మాటామాట పెరిగి హత్యకు దారి తీసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు సమాచారం. ఇదే కోణంలో పోలీసులు విచారణ చేపట్టి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

తల్లిని గెంటేసిన తనయుడు

» ఆస్తి లాక్కొని అన్నం కూడా పెట్టని ప్రబుద్ధుడు

» రోదిస్తూ అధికారులకు విన్నవించుకున్న వృద్ధురాలు

» న్యాయం చేయాలని ఆర్డీవోను వేడుకోలు



వికారాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కని పెంచిన కొడుకే కాలయాముడై తల్లిని వేధిస్తూ అన్నం పెట్టకుండా ఇంటి నుంచి తరిమేయడంతో ఓ తల్లి రోదిస్తోంది. ఈ ఘటన వికారాబాద్ ఆర్డీవో ఆఫీసు వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ధారూరు మండలం నాగారానికి చెందిన గౌసియాబేగంకు ఇద్దరు కుమారులు, కూతురు. అయితే గౌసియా పెద్ద కుమారుడు మహమూద్ మియా తల్లి ఆస్తిని తన పేరిట రాసుకొని తమ్ముడికి ఏమీ ఇవ్వలేదు.



రోదిస్తున్న గౌసియాబేగం

దీంతో తనకేమీ ఇవ్వలేదని చిన్న కొడుకు తల్లిని తనింటికి రానివ్వడం లేదు. ఆస్తి రాసుకున్న పెద్ద కొడుకైనా చేరదీస్తాడనుకుంటే అతడు చిత్రహింసలకు గురి చేస్తున్నాడని గౌసియా విలపించింది. తన వద్ద ఉన్న రూ.4లక్షల డబ్బు తీసుకొని, భూమి కూడా లాక్కున్నాడని, తన ఆస్తి తనకివ్వమంటే కొడుతున్నాడని, ఇంట్లోకి రానివ్వడం లేదని విలపిస్తూ తెలిసింది. అధికారులు ఈ విషయంలో తనకు న్యాయంచేయాలని, తన ఆస్తి అందరికీ సమానంగా ఇచ్చి పెద్ద కొడుకుపై చర్యలు తీసుకోవాలని కోరింది. వృద్ధురాలి బాధను గుర్తించిన ఆర్డీవో వాసుచంద్ర ఆమెకు భోజనం పెట్టించి సమస్యను ఆలకించారు.

ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం

» ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని హైతాబాద్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, గుడిమాల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌లతో కలిసి రూ.కోటితో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హైతాబాద్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.కోటి రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. చందన్‌వెళ్లి, హైతాబాద్, మాచన్‌పల్లి, సీతారాంపూర్ ప్రాంతాల్లో భారీ పరిశ్రమలు ఏర్పడదంతో ఇక్కడి ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందన్నారు. షాబాద్ మండలాన్ని రెండు మండలాలుగా విభజిస్తే పరిపాలన సులభతరమై మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అదేవిధంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన చికెన్ సెంటర్‌ను ప్రారంభిచారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు జనార్దన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌నాయక్, మహేందర్‌గౌడ్, ఖాజామియాపటేల్, శ్రీనివాస్‌గౌడ్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్లు సంజీవరెడ్డి, నర్సింహులుగౌడ్, నాయకులు పీసరి సతీష్‌రెడ్డి, పీసరి వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, సూర్యగౌడ్, కిషోర్‌నాయక్, శ్రీను, వేణు, శ్రీనివాస్, మహేష్, రాఘవేందర్, రమేష్ పాల్గొన్నారు.



హైతాబాద్‌లో సీసీ రోడ్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

రాజకీయాల్లో యువతకు ప్రాధాన్యం



వంశీచంద్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో యువత ప్రాధాన్యం పెంచాలన్నదే రాహుల్ గాంధీ లక్ష్యమని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ నాయకులు బుధవారం వంశీచంద్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. పలు విషయలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా డీసీసీ అధ్యక్షుల ఎంపిక ఏఐసీసీ పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో నాయకులు, కార్యకర్తల అభిప్రాయం మేరకు అధ్యక్షుల నియామకం ఉంటుందని పేర్కొన్నారు. ఈ నెలాఖరు వరకు డీసీసీ అధ్యక్షుల నియామకం పూర్తవుతుందని వెల్లడించారు. ఓటు చోరీపై రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలంతా గళం విప్పాలని పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా

» రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్ నాయక్



అధికారులతో మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

మేడ్చల్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి ప్రతినిధి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి.రవీందర్ నాయక్ బుధవారం మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డీఎంహెచ్‌వో ఉమాగౌరి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, సెక్షన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న టీబీ, ఎన్‌సీడీ, ఇమ్యూనైజేషన్, ఫ్యామిలీ ప్లానింగ్, ఆసుపత్రుల నిర్వహణ వంటి అన్ని ఆరోగ్య కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కార్యక్రమాలపై వివరణాత్మక సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలపై సూచనలు చేశారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు మల్లీశ్వరీ, చంద్రకళ, శ్రీదేవి, సత్యవతి, కౌశిక్, వినోద్, వసంత కుమారి, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నిర్భయచట్టంపై అవగాహన



అవగాహన కల్పించిన షీ టీమ్ ప్రతినిధులు

దోమ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయినాపూర్ ఉన్నత పాఠశాలలో బుధవారం పరిగి సబ్ డివిజన్ షీ టీమ్ ఇన్‌చార్జి నర్సిములు ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ, పోక్సో యాక్ట్, డయల్ 100, షీ టీమ్181, సీసీ కెమెరాలు, బాల్య వివాహాల, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన తదితర నేరాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం బాబుచందు, టీచర్లు, షీ టీమ్ ప్రతినిధులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

కొడంగల్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు టీకాలను రైతులు విధిగా వేయించాలని పశువైద్యులు పరమేశ్ అన్నారు. బుధవారం బోనమ్మతండాలో 210పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. వైద్యుడు మాట్లాడుతూ.. పశువులకు తీవ్ర జ్వరం, నీరసం, నోటి నుంచి సొంగ కారడం, నోరు కాలు గిట్టల మధ్య పుండ్లు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పక వేయించాలన్నారు. హస్నాబాద్ పశువైద్య కేంద్రం సిబ్బంది పల్లు రాళ్ల తండాలో 92పశువులకు టీకాలను వేశారు. కొడంగల్, ఎరాన్‌పల్లి పశువైద్య సిబ్బంది కొండారెడ్డిపల్లిలో 146, ఉడిమేశ్వరంలో 80 పశువులకు టీకాలను వేశారు. కార్యక్రమంలో సిబ్బంది వెంకటయ్య, శేఖర్, సమీర్, విశ్వనాథ్, గోపాల మిత్రలు రాకేష్‌గౌడ్, శివకుమార్, వెంకటప్ప, రైతులు పాల్గొన్నారు.



ఎల్లమ్మతండాలో నిరాహార దీక్ష చేస్తున్న గిరిజన రైతులు

భూమిని అప్పగించాలని నిరాహార దీక్ష

మంచాల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తమ భూములను తిరిగి అప్పగించాలని కోరుతూ మంచాల మండల పరిధిలోని ఎల్లమ్మతండాకు చెందిన గిరిజన రైతులు నిరాహార దీక్ష చేపట్టారు. అక్రమంగా తమనుంచి లాక్కుని తమకు అన్యాయం చేశారంటూ స్థానిక రైతులు మూడురోజులుగా నిరవధిక నిరాహార దీక్షలో కూర్చొన్నారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ బోడకొండ రెవెన్యూ సర్వే నం.91 నుంచి 195 వరకు గల భూములను తాతల కాలం నుంచి నమ్ముకుని జీవనం సాగిస్తున్నామని చెప్పారు. కాస్తు కాలంలోనూ తామే కొనసాగుతున్నామని పేర్కొన్నారు. తమ ప్రమేయం లేకుండా పట్టాదారులుగా కొనసాగుతున్న వారు ఈ భూములను విక్రయించారని చెప్పారు. తర్వాత రియల్ వ్యాపారులు ఈ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి కబ్జా చేశారని ఆరోపించారు. ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆందోళనలో వస్రాం, శంకర్‌నాయక్, పాండు, బాలూనాయక్, మంగమ్మ, రఘునాయక్, బల్సేట్ నాయక్ పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఎత్తివేత హర్షనీయం



షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రవాణాశాఖ చెక్‌పోస్టులను ఎత్తివేయడంతో వాహనదారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. చెక్‌పోస్టుల వల్ల లారీలతోపాటు ఇతర ట్రాన్స్‌పోర్టు వాహనాల సమయం, డీజిల్, డబ్బులు ఆదా అవుతాయని పేర్కొన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని రాష్ట్ర అసోసియేషన్ కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. సీఎంతోపాటు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్కుపోస్టులను ఎత్తివేయడం శుభపరిణామని హర్షం వ్యక్తం చేశారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రామస్వామి

చేవెళ్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పేదలకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి డిమాండ్ చేశారు. చేవెళ్లలో బుధవారం భూపోరాట సమితి ఆధ్వర్యంలో పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలోని సర్వే నంబర్ 75లో పేదలు 44 నెలలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ ప్రభుత్వం వెంటనే ఆ స్థలంలో ఇళ్ల పట్టాలను అందజేయాలని కోరారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పోరాటం చేస్తున్న పేదలను ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సత్యనారాయణ, మక్బుల్, మంజుల, సత్తిరెడ్డి, బాబురావు, ఎలీషా, యాదగిరి, పాపయ్య, పెంటయ్య, లలిత, భాగ్యమ్మ, వెంకటమ్మ, యాదయ్య తదితరులు ఉన్నారు.

రోడ్లపై దుకాణాల కూల్చివేత

శంకర్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేసే వారిపై అధికారులు కొరడా ఝుళిపించారు. శంకర్‌పల్లి మున్సిపల్ అధికారులు, పోలీసు అధికారులు, ట్రాఫిక్ పోలీసులు బుధవారం సంయుక్తంగా శంకర్‌పల్లి పట్టణంలోని ప్రధానరోడ్ల వెంబడి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. చౌరస్తాలో ప్రధాన రోడ్డును ఆక్రమించి పండ్ల వ్యాపారం నిర్వహించే దుకాణాలను తొలగించారు. బస్‌స్టాండ్‌లోకి వెళ్లకుండా ఇరువైపులా వేసిన పండ్ల దుకాణాలు, పూల దుకాణాలు, టీస్టాల్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కొబ్బరి బోండాల దుకాణాలను తొలగించారు. ఆదివారం, బుధవారం, శుక్రవారాల్లో జరిగే సంతతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు చర్యలు చేపట్టారు. కూరగాయల మార్కెట్‌కు వెళ్లే పండ్ల దుకాణాలను సైతం తొలగించాలని, నెహ్రూ మార్కెట్‌లోని స్థలంలో వ్యాపారం చేసుకోవాలని వ్యాపారులకు స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేష్, మేనేజర్ అంజన్‌కుమార్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ సతీశ్, ఎస్సైలు దేవేందర్, శ్రీశైలం, మంజుల, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సీతారామాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి ఘనాపూర్‌లోని సీతారామాంజనేయస్వామి ఆలయ 15వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, ఆయన సతీమణి మాజీ సర్పంచ్ మమత పాల్గొని గణపతి హోమం నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్‌సింగ్, నాయకులు సత్తయ్యగౌడ్, పరమేశ్‌గౌడ్, రాజుగౌడ్, కృష్ణగౌడ్, శంకర్‌గౌడ్, సురేష్ నాయక్, సాయిరెడ్డి పాల్గొన్నారు.



హోమం చేస్తున్న మహేశ్‌గౌడ్ దంపతులు



ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న జోజిరెడ్డి

దివ్యాంగులను ఆదుకుంటాం

షాద్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంగవైకల్యంతో బాధ పడుతున్న దివ్యాంగులను ఆదుకోవడానికి తమవంతు కృషి చేస్తామని రియల్ ఎస్టేట్ వ్యాపారి జోజిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేయనున్న సదరం క్యాంపు కోసం మౌలిక వసతులు కల్పించడానికి రూ.50వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ఆదరణ చూపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నాయకుడు చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

కేశంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కేశంపేట గ్రామ పంచాయతీ కార్మికులకు శివసాయి క్లాత్ సెంటర్ యజమాని, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పోలెపోగు మురళీమోహన్ దుస్తులు అందించారు. దీపావళీని పురస్కరించుకొని బుధవారం తన షాపులో పంచాయతీ కార్మికులు తిమ్మగళ్ల నర్సమ్మ, తిమ్మగళ్ల పారేశ, జంగమ్మ, పెంటమ్మ, పద్మమ్మకు నూతన వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై చెట్ల తొలగింపు

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల మధ్య మూడు కిలో మీటర్ల మేర రోడ్డుపైకి వచ్చిన చెట్లను సీపీఎం కార్యకర్తలు తొలగించారు. బుధవారం నానక్‌నగర్‌కు చెందిన సీపీఎం నాయకుడు బర్ల మల్లేష్, మాజీ సర్పంచ్ దంతుక పెద్దయ్య తదితరులు రోడ్డుకు ఆనుకొని ఉన్న కంప చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ పనులను పరిశీలించిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ సీపీఎం కార్యకర్తలను అభినందించారు.

బహుమతుల అందజేత



స్కూటర్ అందజేస్తున్న రామకృష్ణ, యశ్వంత్

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని ఎల్‌వీఆర్ఎస్‌వై షాపింగ్ మాల్‌లో దసరా, దీపావళి బంపర్ డ్రా నిర్వహించారు. మొదటి బహుమతి ఎలక్ట్రిక్ స్కూటర్ ఆమనగల్లు పట్టణానికి చెందిన ఎండీ మౌలానా, రెండో బహుమతి తలకొండపల్లి మండలానికి చెందిన ఆంజనేయులు మొబైల్ ఫోన్ గెలుపొందారు. ఏఎ్‌సఐ మురళీధర్ రెడ్డి సమక్షంలో షాపింగ్ మాల్ నిర్వాహకులు పున్న రామకృష్ణ, యశ్వంత్ డ్రా తీసి విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణయాదవ్, నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కేశంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం అని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన శేరి నర్సమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందింది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నర్సమ్మకు రూ.75వేల విలువైన ఎల్‌వోసీని మంజూరు చేయించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు ఏఎంసీ డైరెక్టర్ ఎల్‌వోసీని అందించారు. దిద్దెల ముత్యాలు, ఖాజా పాషా, బచ్చ మల్లయ్య, జంగయ్య, రామకృష్ణ, మల్లేష్, మహేష్, చంద్రయ్య, నరసింహ, సురేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

నవంబర్ 2న సదర్

షాద్‌నగర్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకొని సదర్ ఉత్సవాలను వచ్చే నెల 2న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో సదర్ ఉత్సవాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదర్ పండుగను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలి

శంషాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను తరలించే బస్సులను సరైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా నడుపుతున్నాయని, ఇది విద్యార్థుల ప్రాణాలకు ముప్పు అని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ (టీఎస్ఎస్‌వో) రాష్ట్ర అధ్యక్షుడు మీసాల లక్ష్మీనివాస్ ఆరోపించారు. బుధవారం మాట్లాడుతూ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులు ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే స్కూల్ మేనేజ్‌మెంట్‌లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు.

రక్త దానంతో ప్రాణాలను కాపాడుదాం

కొందుర్గు/చౌదరిగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి రక్తం దానం చేసి వారి ప్రాణాలను కాపాడాలని కొందుర్గు ఎస్సై రవీందర్ నాయక్ కోరారు. పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కొందుర్గు మండలానికి చెందిన యువకులు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు.

కేశంపేట: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండారెడ్డిపల్లి యువకులు రక్తదానం చేశారు. బుధవారం సైబరాబాద్ కమిషనరేట్ ఆధ్వర్యంలో చేపట్టిన రక్తదాన శిబిరానికి కేశంపేట పోలీస్‌ల ఆధ్వర్యంలో కొండారెడ్డిపల్లికి చెందిన యువకులు తరలివెళ్లి రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరుల జ్ఞాపకంగా రక్తదానం చేయడం తమకు ఆనందం ఇచ్చిందని తెలిపారు. రక్తదానం చేసిన వారిలో ప్రేమ్ కుమార్ గౌడ్, దశరథ్, శ్రీశైలం, ఆసిఫ్, కర్ణాకర్ ఉన్నారు. రక్తదానం చేసిన వారిని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి అభినందించారు.



రక్తదానం చేసిన యువకులతో ఎస్సై రవీందర్‌నాయక్



కేశంపేట: రక్తదానం చేస్తున్న కొండారెడ్డిపల్లి యువకులు

శంషాబాద్ రూరల్: పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నరేందర్‌రెడ్డి తెలిపారు. శంషాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో మండలంలోని పెద్దషాపూర్, ముచ్చింతల్, చిన్న గోల్కొండ, సుల్తాన్‌పల్లి, శంకరాపూరం గ్రామస్తులు, వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మొత్తం 61 మంది గచ్చిబౌలిలోని పోలీసు కమిషనర్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో రక్తదానం చేశారు.



శంషాబాద్ రూరల్: రక్తదాన శిబిరంలో విద్యార్థులు



సమావేశంలో మట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

కాంగ్రెస్ పాలనలో పైరవీకారులదే రాజ్యం

కొందుర్గు/చౌదరిగూడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో పైరవీకారులదే రాజ్యం కొనసాగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో తెచ్చిన ధరణి చట్టాన్ని సమూలంగా సవరించి శాశ్వత భూసమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టాని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చి ప్రజలకు మేలు చేస్తుందనుకుంటే అందులో కాంగ్రెస్ నాయకులదే పెత్తనం కొనసాగుతుందన్నారు. రైతు భూసమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. రంగారెడ్డి జిల్లాలోనే కొందుర్గు మండలాన్ని పైలెట్ రెవెన్యూ గ్రామంగా ఎంపిక చేసినా నేటికీ భూసమస్యలు పరిష్కారం కాక రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోయ శంకర్, బోయ అశోక్, ఈసరి లింగం, యాదగిరి, శివకుమార్, నరేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా జయశ్రీ బాధ్యతల స్వీకరణ

కడ్తాల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండల తహసీల్దార్‌గా జయశ్రీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ముంతాజ్ చేవేళ్ల డీఈవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ నుంచి జయశ్రీ తహసీల్దార్‌గా వచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో జయశ్రీ బాధ్యతలు చేపట్టి అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. రైతుల భూ సమస్యల సత్వర పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ జయశ్రీని తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదిత్య, ఆర్ఐ వహీద్, ఆపరేటర్ మహేశ్, సీనియర్ అసిస్టెంట్ రాజ్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాదయాత్రగా శబరిమలకు..

నందిగామ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాల ధరించి మహా పాదయాత్రతో స్వామిని దర్శించుకోవడానికి మాలధారులు మహా పాదయాత్ర చేపట్టారు. బుధవారం నందిగామలోని అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు మాల ధరించారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి సాయంత్రం కాలినడకన శబరిమలకు పయనమయ్యారు. స్వామి దర్శనం కోసం మహా పాదయాత్రగా బయలుదేరిన స్వాములు శేఖర్, ప్రేమ్, శ్రీను, నాగర్జునరెడ్డి, నవీన్, అనంత్, అయ్యప్ప, వేణుగోపాల్, శ్రీకాంత్, నరేందర్, జంగయ్య, జగదీశ్, శ్రవణ్‌ను గురుస్వామి గిరీషన్ నాయర్ ఆశీర్వదించి భక్తులను సాగనంపారు.



కడ్తాలలో కొమురం భీం జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

కొమురం భీమ్‌కు ఘన నివాళి

కడ్తాల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నిజాం నిరంకుశ పాలనను ఎదురించి పోరాడిన పోరాట యోధుడు కొమురం భీమ్‌ను జాతి ప్రజలు ఎన్నటికీ మరువరని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ వెంకటేశ్ అన్నారు. కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకొని కడ్తాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గురిగళ్ల లక్ష్మయ్య, సత్యంయాదవ్, మాలే మల్లేశ్‌గౌడ్, శంకర్, యాదయ్య, రాజు, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

యాచారం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని యాచారం ఎంపీడీవో రాధారాణి అన్నారు. బుధవారం యాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించారు. డబ్బుల కోసం ఇతరులపై ఆధారపడరాదని, బిల్లులు రాలేదని ఆందోళన చెందొద్దని లబ్ధిదారులకు సూచించారు. ఇసుక ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమెవెంట ఉపాధి హామీ పథకం ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి ఉన్నారు.

ఆమనగల్లు: ప్రభుత్వ నిబంధనలకు లోబడి లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసుకోవాలని ఎంపీడీవో మాదురి కోరారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి, చెన్నంపల్లి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల చెల్లింపులో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండలంలో 82శాతం ఇందిరమ్మ ఇళ్లు రూఫ్ లెవెల్ ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరై ఆర్థిక స్థోమత లేని మహిళా సంఘం సభ్యులకు ఇందిరా క్రాంతి పథకం ద్వారా రూ.లక్ష నుంచి 1.50 లక్షల రుణ సదుపాయం కల్పించాలని ఏపీఎం నీరజకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వినోద, ఏపీఎం మాధవరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్, పవన్, ఫీల్డ్ అసిస్టెంట్లు వినోద్, రమేశ్ ఉన్నారు.



యాచారం: ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాధారాణి

దినదినం దుర్భరం!

(ఐదో పేజీ తరువాయి)

చేసుకునే వారే ఉన్నారు. అయితే కార్మికులకు ప్రభుత్వం అందించే లేబర్ గుర్తింపు కార్డుల సంఖ్య సగంలోపే ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 45వేల మంది కార్మికులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ నేటికీ వారికి గుర్తింపు కార్డులు మంజూరు చేయలేదు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి అందే ప్రయోజనాలు కార్మికులు పొందలేకపోతున్నారు. కనీసం గుర్తింపు కార్డులు ఉంటే కూలీ పనులు లేనప్పుడు తమకు ఎంతోకొంత ఆసరాగా ఉంటుందని కార్మికులు తెలిపారు.

శాశ్వత స్థలం ఏర్పాటు చేయాలి



అడ్డా కూలీల కోసం ప్రభుత్వం ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలి. అందులో రెస్ట్ రూంలు, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు లాంటి సౌకర్యాలు కల్పించాలి. అలాగే స్థానిక లేబర్ అధికారులు ఎంత మంది పనుల్లో ఉన్నారో స్వయంగా గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూలీలకు అందేలా చర్యలు తీసుకోవాలి.

- పినపాక ప్రభాకర్, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్

ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

శంషాబాద్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని అమ్మపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులను శంషాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ, ఆలయ పునర్నిర్మాణ దాతలు నీరటి రాజు ముదిరాజ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్చర్ భావనకు పలు సూచనలు చేశారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్కుడ మాజీ ఎంపీటీసీ సందరవెల్లి శ్రీనివాస్, గుండాల విశ్వనాథం పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మాజీ జెడ్పీటీసీ, ఆలయ నిర్మాణ దాతలు

ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

(ఐదో పేజీ తరువాయి)

సేకరణ సభ జరిపారు. కాగా మా భూముల జోలికి రావొద్దని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఉన్న జీవనాధారం పోతే మా బతకులు ఏం కావాలని నిలదీశారు. రైతులను సముదాయించడానికి ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డిలు యత్నించినా వారు శాంతించలేదు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని ఆర్‌డీవో అనంతరెడ్డి రైతులకు వివరించారు. ఎకరాకు రూ.కోటి పరిహారం ఇస్తేనే భూములిస్తామని రైతులు తేల్చి చెప్పారు. అంతేకాకుండా ఇవే సర్వే నెంబర్లలో కొందరు తప్పుడు సర్టిఫికెట్లను సృష్టించి ప్రభుత్వ పథకాలను పొందుతున్నారని పలువురు రైతులు అధికారులకు వివరించారు. బినామీల భరతం పట్టి వారు ఇంతవరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పొందిన పరిహారం రాబట్టాలని డిమాండ్ చేశారు. పరిహారం ఇచ్చే సమయంలో, అప్పటి అసైన్డ్ సర్టిఫికెట్లను, రికార్డులను పరిశీలించి నిజమైన లబ్ధిదారులకు పరిహారం ఇస్తామని ఆర్‌డీవో తేల్చి చెప్పడంతో రైతులు శాంతించారు. ఫార్మాసిటీ రైతులకు ఇచ్చే విధంగా మొండిగౌరెల్లిలోని ప్రభుత్వ భూముల సేకరణ విషయంలో డబ్బు అథారిటీలో జమ చేసి భూములు తీసుకోవడానికి అధికారులు సన్నద్ధమవుతున్నట్లు తెలిసింది.

ఫార్మాసిటీ రైతులను ఆదుకోండి

యాచారం మండలంలోని తాటిపర్తి, మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లోని ఫార్మాసిటీ బాధిత రైతులకు మెరుగైన పరిహారం అందించి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాంలు రాష్ట్ర భూసేరణ అథారిటీ న్యాయాధికారిని బుధవారం నాంపల్లిలోని అథారిటీ కార్యాలయంలో వారు కలిసి కోరారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూసేకరణ నిబంధన మేరకు నిషేధిత జాబితాలో ఉన్న భూములకు పరిహారం పెంచడంపై శ్రద్ధ తీసుకోవాలని వారు కోరారు. ఫార్మాసిటీ కోసం భూములు కోల్పోయిన రైతులంతా నిరుపేదలని వారు న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. భూసమస్యలను ఆలస్యం కాకుండా రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కాగా రైతులతో పాటు రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులతో మాట్లాడి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని న్యాయాధికారి వారికి సూచించారు.

ధర ఉన్నా.. దిగుబడి సున్న

(ఐదో పేజీ తరువాయి)

కురిసిన భారీ వర్షాల కారణంగా చేతికి వచ్చిన క్యారెట్ పంట భూమిలోనే మురిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 30 వేల వరకు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే దిగుబడి సైతం తగ్గిందంటున్నారు. దీంతో పెట్టుబడి సైతం వచ్చే పరిస్థితి లేదని ఆయా గ్రామాల రైతులు పేర్కొంటున్నారు.

మార్కెట్‌లో భలే డిమాండ్

క్యారెట్‌కు ఈ ఏడాది మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ నగరంలోని గుడిమల్కాపూర్, బోయిన్‌పల్లి, మూసాపేట్ తదితర మార్కెట్‌లకు రైతులు క్యారెట్‌ను నిత్యం తరలిస్తుంటారు. అయితే వర్షాల కారణంగా పొలాల్లో క్యారెట్ మురిగిపోయి దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో మడుమూ (10కిలోలు) రూ. 250 నుంచి 350 వరకు అమ్ముపోతుందని రైతులు చెబుతున్నారు. మార్కెట్‌లో క్యారెట్‌కు ధర ఉన్నా దిగుబడి తక్కువగా ఉండటంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు కిలో క్యారెట్ రూ. 40 నుంచి రూ.50 వరకు అమ్ముతున్నారు. కాగా మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గ క్యారెట్ దిగుబడి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.

వర్షాలతో పంట మునిగింది



ఎంతో ఆశతో రెండు ఎకరాల్లో క్యారెట్ పంటను సాగు చేశాను. పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు భారీగా కురువడంతో పంట పొలంలోనే మురిగిపోతుంది. ఎకరాకు రూ. 30 వేలకుపైగా పెట్టుబడి పెట్టాను. క్యారెట్ పంట ఏపుగా పెరిగినా భూమిలోంచి తీసి చూస్తే కుళ్లిపోయి ఉంది. మార్కెట్‌లో క్యారెట్‌కు మంచి డిమాండ్ ఉంది. దిగుబడి లేకపోవడంతో పెట్టుడులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

- కె. రాములు, క్యారెట్ రైతు, పామెన

బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థికసాయం

ఆమనగల్లు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన పల్లె బాలయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం బాలయ్య మృతదేహాన్ని బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాలయ్య మృతిపై పట్ల సంతాపం ప్రకటించారు. ఆయనవెంట నాయకులు చుక్కని రంజన్‌గౌడ్, మహేశ్‌నేత, గణేశ్, తదితరులు ఉన్నారు.

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన పార్వతమ్మ ఇటీవల మృతి చెందింది. మృతురాలు కుటుంబాన్ని బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ పరామర్శించారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వెంకటేశ్ రూ.3 వేలు సమకూర్చగా ట్రస్ట్ సభ్యులు, నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు రమేశ్, రాజు, పాండురంగయ్య, ఎల్లయ్య, విష్ణు, యాదయ్య, శ్రీను, ఐలయ్య, హుస్సేన్, ఈదన్న, రాములు, సత్యనారాయణ, పహిల్వాన్, మల్లయ్య, జంగయ్య తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి



మల్లేశ్(ఫైల్)

తలకొండపల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన తలకొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. గర్విపల్లి గ్రామానికి చెందిన వస్పుల మల్లేశ్(27) తుక్కుగూడలోని ఓ హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు కొన్ని రోజుల నుంచి ఆర్థిక ఇబ్బందులతో తరచూ తన తండ్రితో గొడవపడేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని..

శంకర్‌పల్లి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వర్తి గ్రామానికి చెందిన శివకుమార్(22) డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. కాగా, శివకుమార్ కొజ్జగూడ గ్రామానికి శిరీషను మూడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. శిరీష 15 నెలల క్రితం గర్భంతో తల్లి గారి ఇల్లయిన కొజ్జగూడకు వెళ్లింది. శిరీష ఏడాది క్రితం పాపకు జన్మనిచ్చింది. అయితే, శివకుమార్ అత్తగారి ఇల్లయిన కొజ్జగూడకు వెళ్లి భార్య శిరీషను ఎల్వర్తికి రావాలని అడిగాడు. పలుమార్లు అడిగినా ఆమె కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన శివకుమార్ మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు..

కొత్తూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మాపూర్ చౌరస్తా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాండు(60) అనే కార్మికుడు మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ నర్సయ్య తెలిపారు. మహేశ్వరం మండలం అమీర్‌పేట్ గ్రామానికి చెందిన పాండు తిమ్మాపూర్ సమీపంలోని ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగా విధులకు హాజరయ్యేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పాండును కొత్తూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత

మహేశ్వరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత పడింది. ఈ ఘటన బుధవారం మహేశ్వరం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మిద్దింటి కిష్టయ్య అనే రైతు తనకున్న ఆవులు, గేదెలను గ్రామ సమీపంలోని పొలం వద్దకు మేతకు తీసుకెళ్లాడు. రోడ్డు పక్కనే పూర్తిగా చెట్ల పొదల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తున్న ఆవుకు షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి రూ.70 వేలు విలువ చేసే ఆవు చనిపోయిందని, తమకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు కిష్టయ్య వేడుకున్నాడు.

అదృశ్యమైన తల్లీపిల్లల ఆచూకీ లభ్యం

24 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

కేశంపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పిల్లలతో కలిసి తల్లి అదృశ్యమైన కేసును కేశంపేట పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. తల్లితోపాటు పిల్లలను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. వివరాలోకి వెళ్తే.. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట పంచాయతీ పొడగుట్టతండాకు చెందిన కేతావత్ లలిత తన ఇద్దరు పిల్లలు అమిత్ పటేల్, లంసిని తీసుకుని 19న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. 21న మంగళవారం లలిత అన్న ప్రకాశ్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన సీఐ నరహరి, రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్, శంషాబాద్, గతంలో ఆమె నివాసం ఉన్న నాంపల్లి ప్రాంతాల్లో వెతికారు. బుధవారం జేపీ దర్గాలో ఉన్నట్లు గుర్తించి పిల్లలతో సహా ఆమెను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అన్న కేతావత్ ప్రకాశ్‌ను పిలిపించి తల్లి, పిల్లలలను అప్పగించారు.

యువత స్వశక్తితో ఎదగాలి



రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం శక్తితో ఎదిగి పది మందికి ఉపాధి కల్పించేస్థాయిలో ఉండాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మాచన్‌పల్లి గ్రామానికి చెందిన సూర్యగౌడ్ శ్రీ వినాయక్ రియల్ ఎస్టేట్ ఆఫీసును బుధవారం గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చందన్‌వెల్లి, హైతాబాద్‌లో అనేక కంపెనీలు రావడంతో ఇక్కడ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారాలు నిర్వహిస్తే లాభాలు వస్తాయన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని షాబాద్ ఏఈ కోటేశ్వర్‌రావు బుధవారం ప్రకటనలో తెలిపారు. హైతాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ హైతాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున హైతాబాద్, పెద్దవేదు, పెద్దవేదుతండా, సాయిరెడ్డిగూడ, లింగారెడ్డిగూడ, గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

సీసీ కెమెరాలతో గ్రామాలకు భద్రత

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో గ్రామానికి భద్రత ఉంటుందని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామానికి చెందిన మల్లేష్ బుధవారం ఇన్‌స్పెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల నేరాలు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శరత్ ఉన్నారు.

ఎలికట్ట చౌరస్తాలో వాహన తనిఖీలు

షాద్‌నగర్ రూరల్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలికట్ట చౌరస్తాలో బుధవారం ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న పలువురిపై చర్యలు తీసుకున్నారు. బైక్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.